


# లౌక్యం

షీలా శివరామ్

“పదేళ్ళొస్తున్న వెధవకి ఇంత బొత్తిగా లౌక్యం తెలీదేం ఖర్మండీ!? రేపు ఈ దౌర్భాగ్యపు ప్రపంచంలో ఎట్లా బతుకుతాడో ఏమో” అంటూ తల పట్టుకుంది తల్లి.

‘ఏవిటేవిటి? ఏవయిందే?’ అన్నాడు తండ్రి ఖంగారుగా.

తొమ్మిదేళ్ళ నానిగాడు బిక్క-మొహం వేసుకుని అమ్మని, నాన్నని చూస్తూ నిలబడ్డాడు.

‘హయ్యో్యరాత? ఏవడుగుతారు చెప్పండి! నలుగుర్లో నా పరువు తీసేశాడనుకోండి: దిక్కు-మాలిన వెధవ! అసలేవయిందంటే, మనం ఎన్నాళ్ళనించో రెండు పూల తొట్టెలు కొనాలనుకుంటున్నామా?’ అంటూ ఆగింది తల్లి.

‘అవునూ! అనుకుంటున్నాం. అయితే?’ అన్నాడు తండ్రి సందేహంగా.

‘పాపిష్టి వెధవ పరువు కాస్తా తీసి పారేశాడండి’ అంది మళ్ళా తల్లి.

‘పరువు పోయిన సంగతి చెప్పావుగా! ఎట్టా పోయిందో చెప్పు’ అన్నాడు తండ్రి.

‘అసలా వెధవని ముందర రెండు వాయించండి’ అంది తల్లి గుర్రుగా.

‘చెప్పు. చెప్పాక వాయిస్తా’ అన్నాడు తండ్రి భరోసాగా.

‘పూల తొట్టెలు కొనాలనుకుంటున్నామా లేదా?’ అంది తల్లి.

‘అవునూ’

‘సాయంత్రం ఓ కుర్ర వెధవ ‘పూల తొట్టిలో’ అంటూ కేకపెడుతూ వచ్చాడండి. ‘ఎట్టారా అబ్బీ?’ అన్నా. అర్ధరూపాయమ్మా అన్నాడు. వాడి దుంప తెగ. కరువంతా వాడి దగ్గరే మండిపోతోంది. ఓ సంగతి ఒప్పుకోవాల్సిందేనండోయ్! తొట్టెలు మాత్రం దిట్టంగా, కుదుమట్టంగా వున్నాయనుకోండి! ఆ ఏం చెప్పాను?’ అంది తల్లి.

‘అర్ధరూపాయన్నాడు’ అన్నాడు తండ్రి.

‘అన్నాడా! సరి నేనేమో పావలాకివ్వరా వెధవాయి! అన్నా. వింటున్నారా?’ అంది తల్లి.

‘చెప్పు, చెప్పు’ అన్నాడు తండ్రి.

‘ఆ పళాన, ఆ వెధవాయి వేలెడంత లేడు! ఎట్టా నవ్వాడనుకున్నారు! అసలు ఇంతింత వెధవలకి అంతంత తెలివితేటలు ఎలా వస్తాయో ఆశ్చర్యంగా వుంటుందనుకోండి! ఎందుకూ మన వెధవలూ వున్నారు! ఓ లౌక్యమా పాడా? వాయినాలు చెల్లించటానికి తప్ప’ అంటూ రుసరుసలాడింది తల్లి.

‘సరే సరే తరవాత?’ అన్నాడు తండ్రి.

‘సరే పోనీ ముప్పై పైసలకివ్వమన్నా! ఊహూ ససేమిరా ఇవ్వనుగాక ఇవ్వనన్నాడు. మొండి వెధవ. సరే ఎంతకిస్తావో చెప్పేడవమన్నా! అర్ధరూపాయికి పైసా తగ్గనన్నాడు. అసలు ఇంతంత పిల్లలకి అంతంత....’ అంది తల్లి.

‘సరే, సరే, తరవాత?’ అన్నాడు తండ్రి.

‘ఆ ఎంతవరకు వచ్చాం?’

‘పైసా తగ్గనన్నాడు’ అన్నాడు తండ్రి.

‘అన్నాడా? పోనీ నలభై పైసలకివ్వరా వెధవ కానా అన్నా. ‘ఊహూ’ అన్నాడు. పోనీ

ఐదు పైసలయినా తగ్గించరా తండ్రీ అన్నా. ‘సనేమిరా’ అన్నాడు. వింటున్నారా?’ అంది తల్లి.

‘ఊఊ’ అన్నాడు తండ్రి నవ్వు దాచుకుంటూ.

‘మీరేం నవ్వక్కర్లేదు. రోజులట్టా మండి పోతున్నాయి’ అంది కోపంగా తల్లి.

‘సరే సరే’ అన్నాడు గాభరాగా తండ్రి.

‘సరే వెధవయ్యా రోజులు మీవి కానీ మావి కాదులే అనుకుని రెండు తొట్టెలు ఎంపిక చేసి పెట్టానా? అలమారంతా వెదికినా రూపాయి దొరికి చావదే! రూపాయి నోట్లన్నీ పట్టుకుపోయి ఏం చేస్తున్నారండీ?’ అంది ప్రవాహాన్ని భర్త మీదకి మళ్ళిస్తూ.

‘సరే సరే, తరవాత?’ అన్నాడు ప్రమాదాన్ని పసికట్టిన తండ్రి గాభరాగా.

‘ఇంకా తరవాతేమిటి నా తలకాయ! చివరికి అలమారంతా గాలించగా రెండు రూపాయల నోటొకటి బట్టలడుగున దొరికింది. సరే ఏదో ఒహటి అనుకుని వాడికిద్దునుగదా! ‘చిల్లర లేదమ్మా మీరే బోణీ బేరం’ అన్నాడా కుర్ర కుంక. చూశారా?’ అంది తల్లి విడ్డూరంగా.

‘చూస్తున్నా, చూస్తున్నా’ అన్నాడు తండ్రి.

‘సరే అట్టా పోయిరారా అబ్బాయి. మరో రెండు అమ్ముకునిరా. వచ్చి నీ డబ్బులు నువ్వు పట్టుకుపోరా అన్నా. సరేనంటూ రెండు తొట్టెలు దిగవిడిచిపోయాడు. అప్పుడేవయిందనుకున్నారు?’ అంటూ కోపంగా నానిగాడి వైపు చూసింది తల్లి. నానిగాడు తప్పు చేసినట్టుగా చటుక్కున తలొంచుకున్నాడు.

‘ఏవయింది’ అన్నాడు తండ్రి సందేహంగా.

‘ఆ ఏపీ కాలేదండీ! పెరట్లో పెడదాం గదా అని ఎత్తబోతుంటే చెయిజారి ఓ పూలతొట్టె కాస్తా కిందపడి ఓ వాసి బీటిచ్చిందండి నిజం చెప్తున్నాగదా!’ అంది తల్లి సత్య హరిశ్చంద్రుడి సహోదరిలా.

‘ఊఁ అయితే?’ అన్నాడు తండ్రి.

‘ప్రాణం వుసూరుమందనుకోండి. ఇంకా ఆ కుర్ర కుంకకి డబ్బన్నా ఇవ్వలేదు. హయ్యో రామ! తొట్టె కాస్తా బీటిచ్చిపోయిందే అని ప్రాణం వుసూరుమందనుకోండి’ అంటూ ఉసూరు మంది తల్లి.

‘సరే, సరే’ అన్నాడు తండ్రి.

‘ఏం చెయ్యడవా అని అట్టా కూర్చునుండ గానే, ఓ గంటన్నా గడవకుండానే ఆ కుర్ర కుంక పరుగెత్తుకొచ్చాడు పైసలకోసరం.’

‘ఇదేవిట్రా అబ్బీ బీటిచ్చింది అంటకట్టావు?’ అంటూ కాస్త గట్టిగా దబాయించాననుకోండి! అవతాన ఈ వెధవ—అదే మీ ఈ సుపుత్రుడు—గుడ్లెట్టుకుని చూస్తూ నుంచున్నవాడు నుంచోక ‘అమ్మా, నీ చేతిలోంచి జారినప్పుడేగదే పగిలింది? అంటాడుటండీ ఆ కుర్రకుంక ముందు?’ అంది తల్లి కుతకుతలాడిపోతూ.

‘ఇంత లౌక్యం తెలీదేమండీ వెధవకి’ అంటూ తల బాదుకుంది తల్లి.

‘ఆ సూరమ్మా, సుబ్బమ్మా, పంకజాక్షి అక్కడే వున్నారు గదా? ఏవనుకుని వుంటారు చెప్పండి’ అంది తల్లి క్రోధంగా.

‘అదీ సంగతి!’ అంటూ నవ్వబోయి మానే శాడు తండ్రి.

నానిగాడు ఆశగా తండ్రి వైపు చూశాడు. తండ్రి ఓసారి ఇబ్బందిగా తల్లి వైపు చూసి మొహం తిప్పుకున్నాడు.

‘మరి అబద్ధం ఆడకూడదని నువ్వే చెప్పావుగా?’ అన్నాడు నానిగాడు నంగి నంగిగా.

తండ్రి మొహం చాటంతయింది. తల్లి మొహం ఇనప్పెనంలాగా వేడెక్కింది.

‘అబద్ధమేవిట్రా అడ్డగాడిదా! నువ్వా సమయంలో నోరుమూసుకు వూసుకోవటమే లౌక్యంరా వెర్రి నాగన్నా! ఇప్పటికయినా తెలుసుకుని ఏడు, మహా సత్య హరిశ్చంద్రుడు వూడిపడ్డాడు’ అంటూ విరుచుకుపడింది తల్లి.

నానిగాడు తండ్రి వైపు చూశాడు. తండ్రి తప్పు చేసినట్టుగా తలొంచుకున్నాడు నిస్సహాయంగా.

‘అట్టా కూచుంటారేమండీ పోతపోసిన కంచు చెంబులాగా! వాడికి, అదే మీ వంశోద్ధారకుడికి కాస్తంత లౌక్యం నేర్పండి. రేపొద్దున అడుక్కు తినడానికి కూడా పనికిరారు ఇలాటి వెధవలు. సరే అనరేం?’ అంది తల్లి రుసరుసలాడుతూ.

‘సరే, సరే....’ అన్నాడు తండ్రి.

*

తల్లి తండ్రి సినిమా ప్రోగ్రాం పెట్టుకున్నారు. తండ్రి ముందరేపోయి వీధి మలుపు దగ్గర ఎదురు చూస్తున్నాడు తల్లికోసరం. తల్లి పని దానికి పిల్లలిద్దర్నీ అప్పగించి, నానిగాడిని పక్కకి పిలిచింది.

‘ఒరేయ్ నానీ! వచ్చేటప్పుడు, నీకేమో చాక్లెట్టు తెస్తాగానీ బుజ్జిగాడికి మాత్రం మేం సినిమాకి వెళ్ళామని చెప్పబోకు. నేను నాన్న కలిసి వెళ్ళటం చూస్తే వెధవ ఏడుపు మొదలెడ తాడు. తెలిసిందా. తమ్ముడిని ఏడిపించబోకు. నా కన్న నాని’ అంటూ నానిగాడి తల ముద్దు పెట్టుకుంది తల్లి ప్రేమగా.

నానిగాడు బుద్ధిగా తలూపాడు. తల్లి బుజ్జిగాడి దగ్గరకొచ్చి రెండు చేతుల్తోనూ కడుపు పట్టుకుని బాధ నటిస్తూ ‘అమ్మో, బుజ్జీ, అమ్మో కడుపు నొప్పిరా’ అంటూ బాధపడింది. ‘మందేసుకో

లౌక్యం

ఒకామె నగలతో నిద్రపోతూ వుంటే దొంగ కనిపెట్టి, నగల మీద చెయ్యివేశాడు. ఆమెకు మెలకువ వచ్చింది. దొంగను చూపింది. కాని నిభాయించుకుని లౌక్యంగా మాట్లాడి, దొంగను పంపించెయ్యాలనుకుంది. “చూడు నాయనా దొంగా—నువ్వు మొత్తం తీసుకెళ్ళిపో నాకేం అభ్యంతరం లేదు. ఎంచేతంటే అవన్నీ రోల్డుగోల్డువి” అన్నది – నిర్లక్ష్యంగా. దొంగ ఇంకా తెలివైనవాడు. “అలాగా! నేను రోల్డుగోల్డు నగల దొంగని. సరైన చోటుకే వచ్చానన్నమాట” అని మొత్తం వొలుచుకున్నాడు.

వాలిరా? డాక్టరు దగ్గరికి పోదామా? వస్తావా?' అంది తల్లి మరింత నటిస్తూ.

బుజ్జిగాడు బిక్కమొహం వేసి తల్లి వైపు చూశాడు. రానంటూ తలూపి నానిగాడి వెనకాల నక్కాడు. 'ఉహూ డాక్తరు, బయం' అంటూ.

'అయితే నేపోయి మందు తెచ్చుకోనా అంది?' తల్లి. వాడు సందేహంగా తలూపాడు. తల్లి మరోసారి జాగ్రత్తలు చెప్పి వీధి మొదట్లో తండ్రిని కలుసుకుంది.

*

తల్లీ, తండ్రీ చెట్టాపట్టాలేసుకుని సినిమా నుంచి తిరిగొచ్చారు. నానిగాడు మంచంమీద నుంచి దూకి, పరుగుపెడుతూ తల్లికి ఎదురొచ్చాడు. తల్లి వాడి తల ముద్దు పెట్టుకుని, 'చాక్‌లెట్' వాడి చేతికిచ్చింది.

నానిగాడు సంతోషంగా తల్లిని చుట్టుకుని 'అమ్మోవ్. నేనూ లౌక్యం నేర్చుకున్నానే!' అన్నాడు సంబరంగా.

తండ్రి వింతగా, తల్లి ఆశ్చర్యంగా చూశారు.

'మరేమో నువ్వెళ్ళాక పిలక తాతయ్యొచ్చాడేవ్!' అన్నాడు నానిగాడు.

'ఎవరూ? మా బాబాయా? మరి వెళ్ళిపోయాడేం? ఏం చెప్పాడు?' అంది తల్లి ఆత్రంగా.

'మరేమో నేను బుజ్జిగాడు కూర్చుని ఆడుకుంటున్నాం. అప్పుడేమో పిలక తాతయ్య సంచీ పుచ్చుకుని లోపలికొచ్చాడు. ఒరేయ్ అబ్బీ, మీ అమ్మేదిరా? అన్నాడే.' అన్నాడు నానిగాడు.

'తరవాత?' అంది తల్లి.

'మరేమో బుజ్జిగాడేమో అక్కడే వున్నాడుగా. నాన్న నువ్వు కలిసి సినిమాకి వెళ్ళిన సంగతి వాడికి చెప్పొద్దన్నావుగా' అన్నాడు నానిగాడు లాపాయింటు వెతికి పట్టుకున్న ప్లీడర్లా ధీమాగా.

'అయితే?' అంది తల్లి గాభరాగా.

'మా అమ్మ సినిమాకి వెళ్ళింది అన్నానే. బుజ్జిగాడు ఏడుపు మొహం పెట్టాడే! 'ఎవరితో వెళ్ళిందిరా? అన్నాడే పిలక తాతయ్య. మరి నువ్వేమో, నాన్న నువ్వు కలిసి వెళ్ళిన సంగతి బుజ్జిగాడికి చెప్పొద్దన్నావుగా!' అన్నాడు నానిగాడు మళ్ళీ—

'అయితే?' అంది తల్లి అయోమయంగా.

'అదే సమయంలో రోడ్డమ్మట పక్కింటి మావయ్యగారు వెడుతున్నారే. మరేమో నాకేమో గొప్ప ఐడియా వచ్చిందే! అందుకని 'పక్కింటి మావయ్యగారితో సినిమాకి వెళ్ళింది మా అమ్మ' అని చెప్పానే పిలక తాతయ్యతో' అన్నాడు నానిగాడు సంతోషంగా.

'ఏవిటీ?' అంది తల్లి తల్లడిల్లిపోతూ.

'అప్పుడేమో పిలక తాతయ్యేమో మీ నాన్నేవయ్యాడ్రా? అన్నాడే కోపంగా. నాకు తెలియదన్నానే. అప్పుడేమో పిలక తాతయ్య....'.

'ఊఁ: ఏమన్నాడు?' అంది తల్లి నీరసంగా.

'అన్నాడు గదా? 'వెళ్ళిందీ! నాకు తెలుసు. అది జగజ్జంత్రీ. కళ్ళు మూసి రాజ్యాలేలుతుందని నా కెప్పుడో తెలుసు. ఛీ, ఛీ' అంటూ సంచీ పుచ్చుకుని లేచ్చక్కాపోయాడే పిలక తాతయ్య' అన్నాడు నానిగాడు సంబరంగా.

'అమ్మా, నాకు లౌక్యంగా మాట్లాడడం వచ్చేసింది గదే' అంటూ తల్లి మొహంలోకి చూసిన నానిగాడు పరుగెత్తి, పకపక నవ్వుతున్న తండ్రి వెనకాల దాక్కున్నాడు భయంగా. □



నిమ్మపండు మనకు చాలా తేలికగా లభ్యమయే వాటిలో ఒకటి. మన దేహారోగ్యానికే కాకుండా, అందానికి కూడా నిమ్మపండును ఉపయోగించి చాలా లాభాలు పొందవచ్చు. ఎలా అంటే:

రోజూ ప్రొద్దున్నే పరగడుపున - ఒక టంబ్లరు గోరు వెచ్చని నీళ్ళలో — సగం నిమ్మపండును పిండి — ఆ రసం తాగితే ఒళ్ళు సన్నగా - నాజూగ్గా వుంటుంది. రోజంతా ఉల్లాసకరంగా వుండడానికి కూడా ఈ నిమ్మరసం బాగా దోహదం చేస్తుంది.

నిమ్మరసంలో ఓ టీ స్పూన్ తేనె కూడా కలిపి తాగితే గొంతు శ్రావ్యంగా వుంటుంది.

నిమ్మరసం మలబద్ధాన్ని పోగొట్టి, జీర్ణశక్తిని కలిగిస్తుంది. క్రీడాకారులు ఆటల్లో బాగా అలిసిపోయినప్పుడు—ఇల్లాలు, వంటింటి పనులలో సతమతమైపోయినప్పుడు ఓ నిమ్మబద్ద చప్పరిస్తే చాలు — మళ్ళీ కొత్త ఉత్సాహం ఏర్పడుతుంది. నిమ్మపులుపు పండ్లకు తగిలితే — చిగుళ్ళు దృఢంగా వుంటాయి. ఇందులో 'సి' విటమిను ఉండడంవల్ల గోళ్ళు, శిరోజాలు పెరగడానికి సహాయపడుతుంది. గోరుచుట్టు వచ్చిన వేలికి నిమ్మపండు రంధ్రంచేసి తగిలిస్తే — మంచిది. నిమ్మకాయరసం పిండివేసిన తొక్కలు కూడా ఉపయోగకరమైనవే. ఈ తొక్కల్ని ఎండబెట్టి కాల్చి పొడిచేసి — ఆ పొడితో రోజూ దంతధావనం చేస్తే పళ్ళు గట్టి పడ్తాయి. మరో ఉపయోగం ఏమిటంటే - ఈ మెత్తని నిమ్మ పొడిలో సీకాయి పొడి కూడా కలిపి - తల రుద్దుకోవచ్చు. మాడె జిడ్డు వదిలించి, శిరోజాలు నిగనిగలాడేలా చేస్తుంది.

నిమ్మరసంలో 'ఆస్కార్బిక్ ఏసిడ్' వుండడం వల్ల ఈ రసాన్ని ఉపయోగించి పుళ్ళు, కత్తి కోతలు — నయం చేయవచ్చును. చాలామంది నిమ్మరసం పుచ్చుకుంటే జలుబు చేస్తుంది అనుకుంటారు. నిజానికి నిమ్మపండు వల్ల జలుబును నివారించవచ్చు.

తలంటి స్నానం చేసేటప్పుడు — శిరోజాలు రుద్దుకునే నీళ్ళలో కొంచెం నిమ్మరసం వేసుకుంటే - తల వెంట్రుకలు నల్లగా ఆకర్షణీయంగా వుంటాయి. అలాగే నిమ్మరసం కలిపిన నీళ్ళతో మొహం కడుక్కుంటే - మొహం కాంతివంతంగా వుంటుంది.

నిమ్మపండు కోసిన తర్వాత - ఆ బద్దలను కాలి మడమల మీద, మోకాళ్ళ కణుపుల మీద అప్పుడప్పుడు గట్టిగా రుద్దుతూ వుంటే ఆ భాగాలు ఎప్పుడూ మృదువుగా వుంటాయి.

